క్లుప్తంగా

కాలువ కట్ట తవ్వేస్తున్నారు

ఈపూరు: అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. మట్టి కనిపిస్తే చాలు అదే పనిగా తవ్వి తోలుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.... మండలంలోని ముప్పాళ్ల ఎన్ఎస్‌పీ అద్దంకి బ్రాంచి కెనాల్ కట్టను తవ్వేస్తున్నారు. గత వారం రోజుల నుంచి యంత్రాలు, ట్రాక్టర్లతో మట్టిని తవ్వుకొని పలు రకాలుగా వినియోగించుకుంటున్నారు. అంతేకాక ఆ మట్టి కొందరు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలువ కట్టలు బలంగా ఉండేందుకు కాలువ నిర్మాణ సమయంలో మట్టి, రాళ్లతో కట్టలను ఏర్పాటు చేశారు. అయితే ఇక ఎక్కడా మట్టి దొరకనట్లు కొందరు అక్రమస్తులు ట్రాక్టర్లను, యంత్రాలను ఉపయోగించుకుని మట్టిని తవ్వుకుంటున్నారు. దీంతో కాలువ కట్టకు గండ్లు పడే ప్రమాదం ఉందని పలువురు రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఎన్ఎస్‌పీ అధికారులు కాలువ కట్ట వద్దకు వచ్చి వారిని హెచ్చరించినప్పటికీ యథాస్థితిగానే మట్టిని తవ్వుకొని తోలడం మొదలుపెట్టారు. విషయం తెలుసుకున్న ఎన్ఎస్‌పీ అధికారులు ఈ నెల 21వ తారీకున అక్కడికి చేరుకొని కాలువ కట్టను పరిశీలించి సంబంధిత వ్యక్తులపై ఈపూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైతులకు నీరందించాల్సిన కాలువలను కూడా వదలడం లేదని, ఇదేవిధంగా కట్టలను తవ్వుకుంటూ పోతే పొలాలకు నీరు పెట్టుకునే పరిస్థితి ఉండదని రైతన్నలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డీఈ రామారావును సాక్షి వివరణ కోరగా సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి అక్రమంగా మట్టిని తవ్వుతున్నవారిపై కేసులు నమోదు చేయించినట్లు తెలిపారు.

నాదెండ్లలో జగనన్న సురక్ష షెడ్యూలు ఇలా...

నాదెండ్ల: జగనన్న సురక్ష పథకం కార్యక్రమంలో జులై 1 నుంచి నెలాఖరు వరకూ జరుగుతుందని తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గానీ, సచివాలయాల్లో గానీ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ గ్రామ సభలు నిర్వహించనున్నారు. జులై 1న సంకురాత్రిపాడు, 4న చిరుమామిళ్ళ, 6న సాతులూరు, 10న సాతులూరు, 12న తూబాడు, 14న గొరిజవోలు, 17న కనపర్రు, 19న ఎండుగుంపాలెం, 21న ఇర్లపాడు, 24న నాదెండ్ల, 26న చందవరం, 28న నాదెండ్ల సచివాలయాల్లో నిర్వహించనున్నారు. గ్రామసభల్లో సంక్షేమ పథకాలకు సంబంధించి అనర్హులైన వారు ఎవరైనా ఉంటే 11 రకాల ధ్రువపత్రాలు నేరుగా ఇంటికే పంపనున్నారు.

నేటితో దరఖాస్తులకు తుదిగడువు

యడ్లపాడు: వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకునేందుకు ఆదివారంతో గడువు ముగుస్తుందని ఎంపీడీవో వై.హనుమారెడ్డి శనివారం తెలిపారు. మండలం పరిధిలో ఖాళీగా ఉన్న నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిలో గుత్తావారీపాలెం జనరల్ కేటగిరి కాగా, చెంఘీజ్‌ఖాన్ పేట ఎస్సీ(జనరల్), యడ్లపాడు-1, సందెపూడి రెండు గ్రామాల్లోనూ బీసీ (జనరల్) ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తులను సోమ, మంగళవారాల్లో పరిశీలించి ఈనెల 27న సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

ఓటర్ల జాబితా దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వసంతబాబు

నాదెండ్ల: ఓటర్ల జాబితాలో సవరణకై వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, చిలకలూరిపేట ఎన్నికల అధికారి వసంతబాబు చెప్పారు. నాదెండ్ల తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. గ్రామ పరిధిలోని బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటి వరకూ 57 పోలింగ్ బూత్‌ల్లో 120 క్లయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ నెల 26న మధ్యాహ్నం 3 గంటలకు నాదెండ్ల మండల పరిధిలోని 57 పోలింగ్ కేంద్రాల స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నందున హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రమణ, డీటీ అనురాధ, ఆర్ఐ రమీజా, సర్వేయర్ శ్రీనివాసరావు ఉన్నారు.

క్రీస్తు మార్గం ఆచరణీయం

రొంపిచర్ల : క్రీస్తు మార్గం ఆచరణీయమని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలో నల్లగార్లపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి గ్రామంలో గల తెలుగు బాపిస్ట్ చర్చిలో ఏర్పాటు చేయనున్న శిలువ నిర్మాణానికి భూమి పూజ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.

మూడు వార్డుల్లో.. రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు

- పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి
- గడపగడపకు వైఎస్సార్‌లో 26, 27, 28 వార్డుల్లో సమస్యల పరిష్కారానికి శ్రీకారం



27వ వార్డులో అభివృద్ధి పనుల ప్రారంభానికి కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: గడప గడపకు వైఎస్సార్ ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారం కోసం వార్డుకు రూ.20 లక్షలు చొప్పున మూడు వార్డుల్లో రూ.60 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఈ మేరకు శనివారం 26, 27, 28 వార్డుల్లో ప్రజలు అడిగిన సీసీ రోడ్లు, కల్వర్టులు, డ్రెయిన్‌ల నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అడిగిన మేర 26వ వార్డులో రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, 27వ వార్డులో డ్రెయిన్లు, రోడ్లు, 28లో కల్వర్టులు, రోడ్లు నిర్మాణం చేపట్టామన్నారు. ఈ పనులతో ప్రజలు చాలా ఏళ్ల నుంచి పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం లభించనుందన్నారు. రానున్న రెండు, మూడు నెలల్లో పూర్తిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు. వార్డులకు వచ్చిన ఎమ్మెల్యేకు నాయకులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రామ్మోహన్, ఎం.ఇ డి.శ్రీనివాసరావు, ఏఈ నాయక్, మాజీ కౌన్సిలర్లు గోగుల శంకరమ్మ, మాడిశెట్టి మోహనరావు, మూడు జిల్లాల యువజన విభాగ అధ్యక్షులు గోగుల మనోహర్, పట్టణ బీసీసెల్ అధ్యక్షుడు అచ్చిశివకోటి, వార్డు ఇన్‌చార్జ్‌లు కాకుమాను కోటిరెడ్డి, కురుగుంట్ల కోటిరెడ్డి, వంకా శ్రీనివాసరెడ్డి, అత్తలూరి వెంకటేశ్వర్లు, నిడమానూరి సురేంద్ర, చీతిరాల గురుపెద్దన్న, షేక్ మాబు, అంజి, చిన్ని శ్రీనివాసరావు, స్వర్ణ పెద రామిరెడ్డి పాల్గొన్నారు.

హ్యాపీ బర్త్‌డే మినిస్టర్ రజిని మేడం

ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు



చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు



గణపవరంలో కేక్ తినిపిస్తున్న వెంకటేశ్వరరావు

చిలకలూరిపేట: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో భారీ జన్మదిన కేక్‌ను పార్టీ నాయకుడు విడదల గోపీనాథ్ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులతో కలసి కట్ చేశారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించారు.

వాడవాడలా అన్నదానం

మంత్రి విడదల రజిని జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు ప్రాంతాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఆర్‌టీ సెంటర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద, భాస్కర్ సెంటర్‌లోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద, కళామందిర్ సెంటర్, కళ్యాణి సెంటర్, పురుషోత్తమపట్నం సెంటర్‌లతో పాటు బాపూజీ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, గ్రామ సర్పంచులు, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు మంత్రి విడదల రజిని జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పలుచోట్ల పార్టీ జెండాను ఆవిష్కరించారు. గణపవరంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు శేఖర్, కోటేశ్వరరావు, కవిత, జ్యోతిర్మయి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కేక్ కట్ చేశారు. అప్పటి మంత్రి ప్రత్తిపాటి పుల్లారావును సునాయాశంగా ఓడించి తొలిసారి ఎమ్మెల్యే, మంత్రి అయిన ఘనత రజినీకి దక్కిందన్నారు. సాతులూరు పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గద్దె కోటేశ్వరరావు, ఆంజనేయులు, పాటిబండ్ల రాజశేఖర్, రావుల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అల్పాహారాన్ని పంపిణీ చేశారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: మంత్రి విడదల రజిని జన్మదిన వేడుకలు మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహరాజు ఆధ్వర్యంలో వంకాయలపాడు గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముందుగా బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. మంత్రి రజినికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలోని 12 మంది పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి, ఒక్కొక్కరికీ రూ.500 నగదును పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ ఖాదర్‌బాష, బింజు సాంబశివరావు, కార్యదర్శి కె.సాంబశివరావు, గ్రామస్తులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ న్యాయం చేయడమే లక్ష్యం

- అలాగే విధులు నిర్వహించాలి
- జగనన్న సురక్ష పథకంపై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి దిశ నిర్దేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రతి కుటుంబానికి పార్టీలకు అతీతంగా న్యాయం చేయటమే లక్ష్యంగా అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. శనివారం టౌన్‌హాలులో పథకం సమాయత్తంలో భాగంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పథకం విజయవంతానికి అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో నియమించిన టీంలు గడపగడపకు వెళ్లి 11 అంశాలలో వారికి కావల్సిన సర్టిఫికెట్లు, ఇప్పటి వరకు పథకాలు అందని కుటుంబాలను గుర్తించి వారికి ఏ కారణం చేత అందటంలో తెలుసుకుని పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే వారం రోజుల వ్యవధిలో జాబితా తయారు చేయాలన్నారు. వీలైనంత వరకు కుటుంబాలకు మేలు జరిగేలా వ్యవహరించాలన్నారు. ఆ తర్వాత ప్రతి సచివాలయ పరిధిలో క్యాంపు ఏర్పాటు చేసి వారికి అవసరమైన సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. రాష్ట్ర చరిత్రలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఈ పథకం ద్వారా తొలిసారిగా అధికారులు గడపగడపకు వెళ్లేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ఇది చాలామంచి కార్యక్రమం అన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రామ్మోహన్, ఎం.ఇ శ్రీనివాసరావు, టీపీవో మోహనరావు, గిరిజన, ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్లు ఇయం.స్వామి, పాలపర్తి వెంకటేశ్వరరావు, వడియరాజుల సంక్షేమ కార్పొరేషన్ జిల్లా కమిటీ సభ్యులు వేముల శివ, నియోజకవర్గ మైనార్టీసెల్ అధ్యక్షులు షేక్ ఖాదర్‌బాష, సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి ఎన్‌కే ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి కందుల ఎజ్రా, పూనూరి కోటిరెడ్డి, వి.సాంబశివరావు, పుల్లంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తొలిఏకాదశి తిరునాళ్లు విజయవంతం చేయండి

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కొండపై వెలసిన రామలింగేశ్వర స్వామి తిరునాళ్లను అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కోరారు. వినుకొండలో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో ఆయన మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ తిరునాళ్లకు లక్ష మందికి పైగా భక్తులు తరలివస్తారని, వారందరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగు నీటి సౌకర్యంతో పాటు భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. స్వచ్ఛంద సేవా సంస్థల సహకారం తీసుకొని అఖండ జ్యోతి, కొండపై జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వాహనాల మళ్లింపుతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, సీఐ సాంబశివరావులతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

యడ్లపాడు: ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలన్నింటిని సత్వరమే పరిష్కరించే లక్ష్యంగా ఎంపీపీ పిడతల ఝాన్సీ చెప్పారు. మండలంలోని రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజా అవగాహన సదస్సుల్ని నిర్వహించారు. సొలస, యడ్లపాడు-1,2 సొలస గ్రామ సచివాలయాల్లో శనివారం జగనన్న సురక్ష అవగాహన కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని జన్మదిన శనివారం రావడంతో ముందుగా యడ్లపాడులో ఎంపీపీ, సొలసలో మాజీ ఎంపీపీ ఎంపీ బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండల సచివాలయ కన్వీనర్ రాచమంటి చింతారావు, పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. మంత్రి విడదల రజినికు శుభాకాంక్షలు తెలిపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయం పరిధిలోని సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలపై సర్వే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వాటన్నింటినీ జులై ఒకటో తేదీ నుంచి ఆయా గ్రామాలకు వచ్చే అధికారుల బృందాలు అక్కడికక్కడే పరిష్కరిస్తారన్నారు. ఇందుకోసం తహసీల్దార్, ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, డీటీలతో రెండు బృందాలు పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కారుచోల హేమ, వైఎస్సార్‌సీపీ పాలూరి శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి, ఏ శ్యాంపాల్, కె.నాగమల్లేశ్వరరావు, బండ్ల పున్నారావు, బొంతా రామారావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

చినకంచర్లలో జలజీవన్ మిషన్ పనులు



ఓవర్‌హెడ్ ట్యాంకు పనులను పరిశీలిస్తున్న అధికారులు

శావల్యాపురం: మండలంలోని చిన కంచర్ల గ్రామంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.50 లక్షల వ్యయంతో ఓవర్ హెడ్ ట్యాంకు పనులు జరుగుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజవేల్పూల కుమార్‌రాజు వెల్లడించారు. శనివారం ఆయన పనులను పరిశీలించి మాట్లాడారు. చినకంచర్ల గ్రామంలో గతంలో ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంకును ముండ్రువారిపాలెం గ్రామానికి కేటాయించామని, జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటి నీటి కుళాయి ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేయడానికి పనులు చేస్తున్నట్లు చెప్పారు. ఇదే గ్రామంలో నూతనంగా మరో రూ. 20 లక్షల వ్యయంతో 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంకు పనులు పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా మండలంలో 17 గ్రామాలు ఎంపిక కాగా రూ.7 కోట్లు 35 లక్షలు అంచనాలు వేశామని త్వరలో టెండరు దశ పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. మొదట దశలో కొత్తలూరు, కారుమంచి,గుంటుపాలెం, వైకల్లు తదితర గ్రామాలో జలజీవన్ మిషన్ పథకంలో పనులు పూర్తి చేసి ఇంటింటి నీటి కుళాయిలు ఏర్పాటు చేసి ఆయా గ్రామాల్లోని ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. మండలంలోని మతుకుమల్లి, ముండ్రువారిపాలెం, వేల్పూరు, పోట్లూరు, కనమర్లపూడి తదితర గ్రామాల్లో బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ సారథ్యంలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయడానికి యంత్ర పరికరాలు మంజూరు అయినట్లు తెలిపారు.

పొలం గట్లపై కంది సాగు చేయాలి

శావల్యాపురం: నాణ్యమైన కంది విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు ఏడీఏ బోయపాటి రవిబాబు చెప్పారు. శనివారం మండలంలోని కనమర్లపూడి గ్రామం రైతుభరోసా కేంద్రంలో శావల్యాపురం, ఈపూరు మండలాల వ్యవసాయ శాఖ సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఏడీఏ పాల్గొన్నారు. ఖరీఫ్ సీజను ప్రారంభమైందని రైతుభరోసా కేంద్రాల్లో రైతులందరికీ ఎరువులు, విత్తనాలు తదితరవన్నీ కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. వరి మిగతా పంట పొలాల్లో గట్లపై కంది పంటను సాగు చేయటం ద్వారా గృహా అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. రైతుభరోసా కేంద్రాల్లోని వీఏఏలు వ్యవసాయ సీజను ప్రారంభం అయిన నేపథ్యంలో నిరంతరం అందుబాటులో ఉండి రైతులకు మెరుగైన సేవలు సకాలంలో అందించాలన్నారు. అనంతరం రైతులకు కంది విత్తనాల సంచులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, ఏఈవోలు పురేటి అశోక, బి.అప్పారావు, సర్పంచ్ తన్నీరు భారతి, మండల వైఎస్సార్ సీపీ కోఆర్డినేటరు బోడెపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజీవ్ రజక కాలనీ రూపురేఖలు మారుస్తాం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- బ్రాహ్మణపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ(నూజెండ్ల): రాజీవ్ రజక కాలనీ, డ్రైవర్స్ కాలనీ, నాగిరెడ్డిపల్లి పట్టణ శివారు కాలనీలను మున్సిపాలిటీలో విలీనం చేసి అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి వినుకొండ రూరల్ మండలం బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని రాజీవ్‌రజక కాలనీ, నాగిరెడ్డిపల్లి, డ్రైవర్స్ కాలనీల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ రాజీవ్‌రజక కాలనీలో సొంత ఖర్చులతో కచ్చా రోడ్లు నిర్మిస్తామన్నారు.

గతంలో రూ.50 లక్షల నిధులతో మెయిన్ బజారులో సీసీ రోడ్డు నిర్మించామని, ఇదే రోడ్డును నరసరావుపేట హైవే రోడ్డు నుంచి కారంపూడి రోడ్డుకు అనుసంధానం చేస్తామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు రాజీవ్ రజక కాలనీ నిర్మాణంలో చేసిన కృషి మరువలేనిదన్నారు. రానున్న రోజుల్లో కాలనీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో వినుకొండ అభివృద్ధి చెందుతుందని, గత టీడీపీ పాలకులు మాటలు చెప్పడం తప్ప వినుకొండకు చేసిందేమీ లేదని అన్నారు. డ్రైవర్స్ కాలనీలో ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

త్వరలో జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగించుకుని ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని, వెంటనే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దండు చెన్నయ్య, సరోజని సురేష్, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులురామయ్య, సొసైటీ చైర్మన్ అనుమోలు నాసరరెడ్డి, మాజీ ఎంపీపీ ములకా రామతులసి రెడ్డి, మాజీ ఎంపీటీసీ తాతిరెడ్డిలతో పాటు స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నూజెండ్లలో సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

వినుకొండ(నూజెండ్ల): అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీ లేకుండా ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నూజెండ్ల మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నూజెండ్లలో సెంట్రల్ లైటింగ్, అప్పాపురం గ్రామంలో రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు ప్రారంభించారు. అనంతరం రైతు భరోసా కేంద్రానికి,హెల్త్ సెంటర్‌కు స్థలాన్ని ఇచ్చిన దాతలు గాదె నాగార్జునరెడ్డి, గోగుల మూడి చిన్నసీతారెడ్డి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే బొల్లా ఘనంగా సత్కరించారు.

మోడల్ సిటీగా నూజెండ్ల...

నూజెండ్ల మండల కేంద్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, పట్టణాల్లో మాదిరిగా విశాలమైన రోడ్లు, ఏ బజారు చూసినా సీసీ రోడ్లు, రూర్బన్ పథ కం పథకం కింద అభివృద్ధి చెందుతుందని, నూజెండ్లలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం దీనికి సంకేతమని అన్నారు. రానున్న రోజుల్లో నూజెండ్ల మోడల్ సిటీగా రూపాంతరం చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ అమ్మిరెడ్డి అంజిరెడ్డి, ఎంపీపీ జయరామిరెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, సొసైటీ చైర్మన్ పొట్లపల్లి పిచ్చిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, ఒంగూరి ప్రసాద్, చిన్నతరహా పరిశ్రమల డైరెక్టర్ తలారి ఆంజనేయులుతో పాటు పాల్గొన్నారు.

రైతులను భాగస్వామ్యం చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ సుహాసిని అనిల్‌కుమార్

శావల్యాపురం: రీసర్వే పనుల్లో రెవెన్యూ అధికారులు రైతులను భాగస్వామ్యం చేయటం ద్వారా చిన్నపాటి లోపాలు కూడా సవరణలు మార్పులు చేయటానికి దోహదపడుతుందని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలానికి మంచిపేరు తేవాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అన్నీ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు గృహ సారథులు సంయుక్తంగా అర్హత కలిగిన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. రానున్న ఖరీఫ్ సీజనుకు రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, తదితరవన్నీ కొరత లేకుండా వ్యవసాయ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. గ్రామాల్లో గ్రామ కంఠం కలిగిన భూముల రిజిస్ట్రేషను అయ్యేవిధంగా రెవెన్యూ అధికారులు చొరవ చూపాలన్నారు. ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మార్కెట్ యార్డు సారథ్యంలో త్వరలో అన్నీ మండలాల వారి ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న పథకాలు తదితర వాటిపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విద్య, వ్యవసాయం, వైద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఇందులో భాగంగా విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యా ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు తప్పు చేస్తే సమాజంలో భావితరాల విద్యార్థులపై పడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించటంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. శావల్యాపురం గ్రామ ఎంపీటీసీ దేవనబోయిన పోతురాజు మాట్లాడుతూ శాశ్వత పంచాయతీ కార్యదర్శి నియామకం చేయాలని అధికారుల దృష్టికి తెచ్చారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలు అమలు తీరు సమస్యలపై శాఖల వారీగా అధికారులు వివరించారు. ఈ సమావేశంలో మండల కో ఆప్షన్ సభ్యులు దూదేకుల హుస్సేన్, వైస్ ఎంపీపీ చెన్నంశెట్టి రంగారావు,ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల జారీలో వలంటీర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నాదెండ్ల: జగనన్న సురక్ష పథకం ధ్రువపత్రాల జారీలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా వలంటీర్లు ప్రధాన పాత్ర పోషించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు చెప్పారు. గణపవరం 1వ సచివాలయం వద్ద శనివారం జగనన్న సురక్ష పథకంపై వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటి వరకూ గణపవరంలోని నాలుగు సచివాలయాలు నాదెండ్ల మండల పరిధిలో ఉన్నాయని, ప్రస్తుతం జగనన్న సురక్ష పథకం చిలకలూరిపేట మున్సిపాలిటీ లాగిన్‌లో ఉన్నాయన్నారు. మున్సిపల్ పరిధిలోని ధ్రువపత్రాల పంపిణీ జరగాలన్నారు. ప్రతి వ్యక్తికి ఏదో సందర్భంలో ధ్రువీకరణ పత్రాల అవసరం అవుతాయన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల మేరకు సచివాలయంలోనే అన్ని ధ్రువపత్రాలు అందుబాటులో తెచ్చారన్నారు. ఆదివారం నుంచి ప్రతి ఇంటినీ సందర్శించి లబ్ధిదారుల నుంచి అవసరమైన పత్రాలు తీసుకోవాలన్నారు. ధ్రువీకరణ పత్రాలు పంపిణీ సమయంలో తప్పనిసరిగా గృహ యజమానులు ఉండాలన్నారు. వచ్చే నెల 22 నుంచి గ్రామంలో క్యాంపు ప్రారంభమౌతుందని తెలిపారు. కార్యక్రమంలో చిలకలూరిపేట వలంటీర్ల కన్వీనర్ విడదల శ్రీనివాసరావు, ఎంఎల్‌వో రామయ్య, పంచాయతీ కార్యదర్శులు అర్వపల్లి శేఖర్, కవిత, జ్యోతిర్మయి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.